
# పందెం

— బొజ్జా సత్యనారాయణ



ఓలి! సోవులమ్మ! బేగో రాయె వొర్జమొచ్చి నాగుంది" అంటూ ఎర్కినాయుడు చిరాగ్గా కేక లేసేడు.

సోములమ్మ వచ్చే జాడ కనిపించలేదు. నాయుడు నిప్పులు తొక్కిన కోతిలా చిందులు వేస్తున్నాడు.

"ఏటి సేత్తన్నావేటి, నాను కంగారడిన కొద్దీ ఆల్సెం సేత్తున్నావు? పందానికి సిద్ధమయిన ఎద్దు మీద ఈగ వాలితే సహించలేక పెద్ద అట్టానంతో తోలేశాడు.

నాయుడు పడుతున్న కంగారంతా పొరిగింటి ముసలమ్మ చూసింది. "ఏట్రా నాయుడూ ఊరికే మర్దల్ని అదరగొట్టేత్తున్నావు" అంది.

"ఈ ముసిల్దేటి! పావ్కంలో పుడ్కనాగ?" అని మనసులో అనుకొని "సూడే, లప్పా! బేగో ఎద్రాయె అంటే లిణుక్కోడి పెట్నాగ లోపల్నుంచి రాట్నం వేదు" అన్నాడు విసుగ్గా.

"ఏటి బాయ్యా, నీ ఆరాటం సూత్తుంటే పోత తించిన గిత్తవా నువ్వే పందెం కొట్రాగున్నావ్?" అంది ముసలమ్మ కూతురు,

"మరేటనుకున్నావ్! మా ఎద్దులంటే ఆకాసంలో మెర్పు తీగ్లే"

"అబ్బో! ఎంత ముత్తాబు సేసినా ముసలి ముఖాలు, ఈడ్పు కాల్లేగా!" పెదవి విరిసింది అమ్మాయి.

"ఏటేటి. ఎంకట్లచ్చీ! నా ఎద్దులు ముస్లినా? వయసు కాదే ముక్యం సుర్కు, అనుబవం కావాలే! మాం పనిలో పడితే, సూస్కో నా సావిరంగా!" అని పెదాలు సప్పరించాడు.

"సీ! నీ జమ్మడ్పోను" అంది సిగ్గు పడుతూ.

"పందే లెక్కడా నాయుడూ!" అడిగింది ముసలమ్మ.

"సోదారం"

"బంగారు బగుమానం పొట్టుకొత్తావన్నమాట"

"ఆరోజు లెల్లిపోనాయి. ఇప్పుడు ఉలవలు, గంట్లు బత్తాలు బగుమానంగా ఇత్తున్నారు" అంటూ మెల్లో వున్న ఎర్రంచు కండవా మడత లోపల నుంచి చివళ్లు దోపి గుండెల దగ్గర నొక్కాడు జారిపోకుండా.

కర్రి ఒట్టెద్దు తల పగ్గాన్ని వెనక్కి లాగి, "కాల్లు తిమ్మిరెక్కాయేటి ముంచో నేకపోతున్నావు?" అని నాయుడు ఎద్దు సూస్తున్నవేపు సూసేడు. "ఎంకట్లచ్చీ! నీ వల్ల పర్కినీ సూసి నా ఎద్దు సిగ్గు పడ్తుందే. లోనకెల్లు" అన్నాడు హాస్యం జోడించి.

వెంకటలక్ష్మి లోపలకు వెళ్ళింది.

## అహింసావాది

ఓ సభలో రెచ్చిపోయి ప్రసంగిస్తోంది వెంకట లక్ష్మి.
"నేను నిజమైన అహింసావాదినని గర్వంగా చెప్పగలను"
"మరి పెళ్ళెందుకు చేసుకున్నట్టో?" సభలో నుండి వినిపించింది.

- పద్మశ్రీ, మాణిక్యారం

---

పళ్లెంలో పసుపు, కుంకుమ పెట్టుకుని బండి ముందుకు వచ్చి ఎడ్ల ముఖాల మీద నీళ్లు జల్లి, పసుపు రాస్తున్న భార్యను చూసి "అమ్మోరమ్మ నాగ! ముత్తాబైనావేటి" అన్నాడు.

"ఎద్రొచ్చేటప్పుడు సుబ్బరంగా వుండాల్రా!" అంది ముసలమ్మ.

"పందెం ఒట్రాకపోతే?" అంది కుంకుమ బొట్టు పెడుతూ సోములమ్మ.

"వాట్రాకపోతే? ఏటి సేత్తావేటి?" అని ముఖం చిట్లించాడు.

"దగ్గర్కి రానివ్వదేమోరా!" అంది ముసి ముసిగా నవ్వుకుంటూ ముసలమ్మ.

"మీ అప్పా తమ్ముడికేటి పన్నేదు" అని మూతి త్రిప్పుకుంది. ముక్కెర మెరిసింది. భర్తకు బొట్టుపెట్టి బండి కెదురుగా నిలబడింది సోములమ్మ.

కొడుకు వైపు చూసి, "సత్నాయుడూ! కూడు తిని మనోళ్లెంటబెట్టుకొని బేగా రాకపోతే నాను పందేలు కాడ ఒంట్రిగోన్నైపోతా!" అని చెప్పాడు నాయుడు.

అక్కడకు వచ్చిన స్నేహితులను బండి ఎక్కించుకొని నాయుడు బండిని పోనిచ్చాడు. బండి వీధి మలుపు తిరిగి వెళుతూంది. అరుగు మీద వాలు కుర్చీలో కూర్చున్న ప్రెసిడెంటు సింహాద్రి సర్పంలా బుర్ర ఊపుతూ "ఈయాల సూస్కో రా నా తడాకా నాయ్యాల" అని మీసం మీద చేయి వేశాడు.

బండిలో వున్న ఎర్కినాయుడుకు ఆ మాటలు ఎడ్ల మెళ్ళో గంటల మోతలకు స్పష్టంగా వినిపించలేదు. కాని సర్పంచ్ చేష్టలు కళ్ళబడిన నాయుడు సింహాద్రి అంతర్యం పసి కట్టాడు. "ఈడోటం మాత్తుంటే పందెంనో పెమాదం తెచ్చి పెట్నాగున్నాడు" అని ఆలోచనలో ఆరాటపడుతున్నాడు నాయుడు.

"ప్రెసిడెంటు గోర్కి నీ మీదంకా గుర్రు తగ్గి నట్నేదేట్నాయుడూ" బండిలో కూర్చున్న వారిలో ఒకరన్నారు.

"ఎలచ్చన్లో ఆ డెంపు పన్జెయ్యలేదని నానంటే మంట" అన్నాడు నాయుడు.

"ప్రెసెంట్గోర్కి ఎల్లకు నాయుడు. ఆడు నక్కజిత్తులోడు" అన్నాడు మరొకడు.

కీడు శంకిస్తూనే "ఆడెత్తులు నీ కాడ సాగవు" అంటూ ఎడ్లను చురుకు చేశాడు నాయుడు.

* * * *

గంగాలమ్మ గుడి దగ్గర సంబరం జోరుగా జరుగుతూంది. దానికి తోడు సంబరానికి సమీపంలోనే ఎడ్ల పందేలు, హడావిడి. ఎర్కినాయుడు ఎడ్లను చూసి "దొరబల్ల ఎద్దు జతకు క్రర్రి బల్లెద్దును జత బాగా కలిపాడు. రంగులు వేరయినా కొమ్ములు రెండింటికి ఒకే మాదిరిగా గిన్ని కొమ్ములతో అందంగా కనిపిస్తున్నాయి" అని మెచ్చుకుంటున్నారు.

ఎర్కినాయుడు అప్పుడప్పుడు పందేలు నెగ్గడం వల్ల అతనికి ఎడ్ల పందెంలో గుర్తింపు వచ్చింది. దొరబల్ల ఎద్దు జతలో ఎద్దుకి వయస్సు మళ్ళి పరుగు తగ్గిపోవడం వల్ల క్రర్రి బల్లెద్దును కొని జత కలిపాడు. కొత్త ఎద్దు జనంలో ధైర్యంగా పరుగెత్తుతుందా లేక పిరికి పడుతుందా అనే అధైర్యం, మరో వైపు పందెంలో ప్రెసిడెంటు సింహాద్రి తన బండికి ఏదైనా అఘాయిత్యం చేయిస్తాడా అనే మీమాంసతో వున్నా, పైకి మేకపోతు గాంభీర్యంగా వున్నాడు నాయుడు.

సూరీడు నడి నెత్తి మీద కొచ్చాడు.

పందెం నిర్వాహకులు హడావిడిగా రోడ్డు వైపు తిరుగుతున్నారు మైకు సెట్టు బాగు చేయించటానికి వెళ్ళిన వారి కోసం.

"ఎమ్మెల్లే గోరు జీపులో వచ్చేత్తున్రు., మైకు నేదని సిట్సుట్లాడతారో ఏటో!" అన్నాడు కమిటీ పెద్దల్లో ఒకడు సింహాద్రి.

"ఎమ్మెల్లే గోరు యమ ధర్మరాజేటి బయ్పడి పోనాకి" అన్నాడు మరొకడు. వారి మాటలకు కొందరు నవ్వారు. అంతలో మంత్రించినట్టు నవ్వులు ఆగి పోయాయి. మేఘాల నుంచి దిగిన పుష్పక విమానంలా ఎగురుతున్న ఎర్ర దుమ్ము లోంచి ఎం.ఎల్.ఎ. గారి జీపు ఊడిపడింది. ముంచెన ఎర్ర ధూళి దులుపుకుంటే ఎం.ఎల్.ఎ. గారు ఏమనుకుంటారోనని తనను ముంచెత్తిన దుమ్మును దులుపుకోకుండా ఆయన చుట్టూ మూగారు.

కార్యక్రమం ప్రారంభానికి ముందు ఎం.ఎల్.ఎ. గారు రిబ్బన్ను కత్తిరించారు. కమిటీ వారి వేసిన షామియానా క్రింద వున్న టేబులు దగ్గర కుర్చీలో ఎం.ఎల్.ఎ. గారు కూర్చోగానే అక్కడ పెళ్లికళ వచ్చింది. ఉలవలు, గంట్లు, తవుడు బస్తాలు మూడు టేబిలు దగ్గర వున్నాయి బహుమతులివ్వటానికి.

ఎడ్ల పరుగు పందెంలో మూడు ఫర్లాంగుల దూరం వెళ్ళి రెండవ బిరి దాటి, తిరిగి మొదటి హద్దుకు రావాలి బండి. పందెంలో పాల్గొనే వారి పేర్లు డ్రా తీశారు. కమిటీ వారు. డ్రా ప్రకారం వరుసగా పేర్లు నోట్ చేశారు.

పందెం ప్రారంభించారు. రోడ్డు మీద వున్న జనాన్ని ఇరు వైపులకు ఒత్తిగిస్తున్నారు వాలంటీర్లు. మూడు ఇసుక బస్తాలు వేసిన మోట బండికి ఎడ్ల జతను పూన్చి బిరి మీద నిలబెట్టారు. బండి యజమాని తొట్టిలో కూర్చుని తల పగ్గాలను వెనక్కి లాగి పట్టు కున్నాడు. కమిటీ పెద్ద ఇసుక బస్తాల మీద కూర్చుని రెండు ప్రక్కల కొయ్యలు గట్టిగా పట్టుకున్నాడు. పందెంలో ఎవ్వరయినా ఎడ్లను కొట్టకుండా చూడ డానికి.

ఎం.ఎల్.ఎ. గారి ఆజ్ఞతో బండి బయలుదేరడం, కమిటీ పెద్ద చేతిలో స్టాపు వాచీ బటను నొక్కగానే ముల్లు తిరగడం ఒకేసారి జరిగాయి. గేలప్ పరుగెత్తుతున్న ఎద్దుల ముందు తమ అనుచరులు ఒకరి తరువాత ఒకరు అంచెలంచెలుగా పరుగెత్తుతున్నారు. అలా పరుగెత్తడం అక్కడ వారికి ఆనవాయితీ. ఎద్లు ఉరుకలు ఉరుకుతూ చూసేవారికి ఉత్సాహాన్ని కలిగిస్తూ రెండవ బిరి దాటి తిరిగాయి. ప్రేక్షకులు వాటి పరుగులను చూసి ఆనంద భరితులై ఈలలు, కేకలు వేస్తూ వాటికి మరింత ఉత్సాహాన్ని రేకెత్తిస్తున్నారు. బండి మొదటి హద్దు దాటగానే తిరుగుతున్న స్టాపు వాచీ ముల్లు ఆగింది. కమిటీ వారు టైమ్ నోట్ చేశారు.

ఎం.ఎల్.ఎ గారు నిలబడి "ఇద్దెల్లొచ్చిన ఎద్లు ఆర్నిమంసాల, పది సెకన్లకు ఒగెత్తాయ్!" అన్నారు.

అలాగే ఒక బండి వెళ్ళి వచ్చిన తరువాత మరొక బండిని విడిచి పెట్టారు. అలా పందెంలో పరుగెత్తిన ఎడ్ల టైములు నోట్ చేశారు. ఇంకా ఎర్కినాయుడు బండిని విడిచిపెట్టాలి. ఆయన బండిని కూడా తీసుకు వచ్చి గీత మీద నిలబెట్టారు. ప్రేక్షకులు నాయుడు ఎడ్ల పరుగులు చూడాలని కుతూహలంగా ఎదురు చూస్తు న్నారు. నాయుడు పంచె కట్టు సరి చేసుకుని బండి ఎక్కి తొట్టిలో కూర్చున్నాడు. కమిటీ పెద్ద ఇసుక బస్తాల మీద కూర్చున్నాడు.

ఎం.ఎల్.ఎ. గారి ఆజ్ఞతో నాయుడి ఎద్లు ముందుకు సాగి ఉరుకుతున్నాయి. దొర బల్లెద్దు ధైర్యంగా ఉరుకుతుంటే రెండవ ఎద్దు జనం వంక చూస్తూ బెదురుతూ దండె వారకు వచ్చి ఉరకలు వేస్తోంది. నాయుడు ముందుకు వంగి ఒక చేత్తో దండి పట్టుకొని, రెండవ చేత్తో ఎద్దు దండి వారకు రాకుండా దాని డొక్క మీద చరుస్తూ చిడత దగ్గరకు నెళ్ళేటట్టు తోలుతున్నాడు. ఆ ఎద్దును తోలే తీరు చూస్తున్న వారు మెచ్చుకుంటున్నారు. ఎద్దు చూపులను అవగాహన చేసుకున్న వ్యక్తి "మావోయ్! క్రర్రి బల్లెద్దు దొంగ సూపు సూత్తుంది. జాగ్రత్తరోయ్!" అని కేకేశాడు ఒకడు.

ఎద్లు ఉరకలు ఉరుకుతూ జనాన్ని రంజింప చేస్తున్నాయి. అంతలో బిగ్గరగా ఈల వినబడింది. ఈల వెంటే నల్ల బట్టలు కట్టుకున్న ఒక కుర్రాడు ఎద్దుల కంట పడ్డాడు. తక్షణమే క్రర్రి బల్లెద్దు బెదురుతూ తోడి ఎద్దును తోయగానే బండి ప్రక్కకు పోయి బోల్తా కొట్టింది. నాయుడు తూలి పడ్డాడు. కమిటీ పెద్ద మెలుకువగా ప్రమాదాన్ని తప్పించుకున్నాడు.

బండి చుట్టూ జనం మూగారు.

పాచిక పారినందుకు మితిమీరిన సంబరంతో సింహాద్రి కమిటీ వారితో పాటు బండి దగ్గరకు నడిచాడు. ఆ బండి క్రింద పడి రక్తంతో తడిసిన కొడుకు శవం కళ్ళ పడగానే కుప్పకూలిపోయాడు సింహాద్రి.

ఎడ్ల పందెంలో తనను మోసం చేసి ఓడించాలని వల పన్నిన సింహాద్రికి తగిన గుణపాఠం అయిందని అను కున్నా, మరో వైపు అన్నెం పున్నెం ఎరుగని కుర్రాడు బలైపోయాడని ఎర్కినాయుడు సింహాద్రి కంటే మిన్నగా బాధ పడ్డాడు.